తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 01 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 272 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు శ్రీకారం

### మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్త కార్యక్రమం

### సాంకేతిక సంస్కరణలు, ఫైళ్ల క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి

### సంక్షేమం నుంచి పారిశ్రామికాభివృద్ధి వరకు సమగ్ర కార్యాచరణ

### సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'ను చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నాలుగు కోట్ల ప్రజల పండుగగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చించారు. దేశ అభివృద్ధి పథంలో తెలంగాణను తిరుగులేని ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో..

# మహిళా న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ అవసరం: సీతక్క

### మహిళల న్యాయవ్యవస్థలో భాగస్వామ్యం కీలకం

### భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణపై దృష్టి

### మహిళా న్యాయవాదుల కోసం ప్రభుత్వం కట్టుబాటు



2లో

# నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

- పరికరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కిషన్ రెడ్డి
- ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై కేంద్రం దృష్టి
- యువత, మహిళలకు స్థానిక ఉపాధి అవకాశాలపై వివరణ

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ మరియు పరికరాల పంపిణీ" కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులకు టూల్ కిట్లు పంపిణీ చేశారు.

మిగతా 2లో..





# డిజిటల్ రూపాంతరణతో సుస్థిర పాలన వైపు తెలంగాణ

### ఈ-పాలనలో కృత్రిమ మేధస్సు, డేటా వేదికల ప్రాధాన్యం

### స్థూల దేశీయోత్పత్తిలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వాటా 11.7 శాతం

### పారదర్శక, పౌర కేంద్రిత పాలన లక్ష్యంగా ముందడుగు

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

2లో

# నిర్మాణ రంగం రాష్ట్ర భవిష్యత్తుకు పునాది

- కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టుల అమలు
- గ్రామీణాభివృద్ధికి మౌలిక వసతుల ప్రాధాన్యం



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ నిర్వహణ కమిటీ మరియు సాధారణ మండలి సమావేశం 2025-26 కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. నిర్మాణ రంగం కేవలం ఒప్పందాలకు పరిమితం కాదని, అది రాష్ట్ర నిర్మాణానికి పునాదిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విజన్ 2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని మౌలిక వసతుల పరంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రోడ్లు మరియు భవనాల శాఖ పరిధిలో సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్, జాతీయ రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్లు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు వంటి బృహత్తర పనులు తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయని అన్నారు.

మిగతా 2లో..

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే 80% ఉద్యోగాలు ఇవ్వాలి

### మాజీ మంత్రి హరీష్ రావు

**ఖాజీపేట్,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు కనీసం 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు డిమాండ్ చేశారు. "కొలువుల కోసం కొట్లాట" పేరిట కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.స్థానిక యువతకు అవకాశాలు ఇవ్వకుండా ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నిర్వహిస్తే తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. "మా ఉద్యోగాలు మాకే కావాలి" అన్న నినాదంతోనే తెలంగాణ రాష్ట్రం సాధించామని, రాష్ట్ర ఏర్పాటుతోనే కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ సాధ్యమైందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదాయ శాఖకు చెందిన 150 ఎకరాల భూమిని ప్రత్యేక అనుమతులతో కోచ్ ఫ్యాక్టరీ కోసం కేటాయించిందని తెలిపారు. కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం అప్పటి ఎంపీలు కేంద్రాన్ని పలుమార్లు నిలదీశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇక్కడ నిర్మిస్తున్నది వ్యాగన్ ఫ్యాక్టరీనా, కోచ్ ఫ్యాక్టరీనా అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని, వెంటనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని, ప్రత్యేక లోగోతో పాటు 99 రోజుల కార్యాచరణ షెడ్యూలును సిద్ధం చేయాలని సీఎస్‌కు సూచించారు. ఈ కాలంలో ఫైళ్ల క్లియరెన్స్‌తో పాటు అన్ని కార్యాలయాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని విస్తరించాలని, ప్రజలు ఇంటి నుంచే సేవలు పొందే విధంగా సంస్కరణలు తీసుకురావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కరెంట్ మీటర్, ఇంటి అనుమతి, నల్లా కనెక్షన్



వంటి సేవలకు ప్రజలు కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా విధానాలు అమలు చేయాలని సూచించారు. ప్రతి ఫైలు స్థితి దరఖాస్తుదారుకు తెలిసేలా పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతను వినియోగించి మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభం, ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి, మ్యానుఫాక్చరింగ్ జోన్‌ల రూపకల్పన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలని సూచించారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని సుపరిపాలనతో నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# మహిళా న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ అవసరం: సీతక్క

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళా న్యాయవాదుల సదస్సు 2026లో మంత్రి దానసరి సీతక్క పాల్గొని ప్రసంగించారు. మాజీ న్యాయవాదిగా తాను పనిచేసిన అనుభవంతో మహిళల న్యాయవ్యవస్థలో భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. న్యాయరంగంలో మహిళల పాత్ర పెరగడం సమాజంలో సమానత్వాన్ని బలపరుస్తుందని సీతక్క తెలిపారు. మహిళా న్యాయవాదుల



భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టపరమైన రక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. న్యాయవాద వృత్తిలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వం గుర్తిస్తోందన్నారు. మహిళా న్యాయవాదుల భద్రతకు సంబంధించి సమగ్ర చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. న్యాయరంగంలో మహిళలకు అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న మహిళా న్యాయవాదులతో సీతక్క ముచ్చటించి వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. మహిళల సాధికారత దిశగా న్యాయరంగంలో మరింత ప్రోత్సాహం అవసరమని ఆమె అన్నారు.

# నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ మరియు పరికరాల పంపిణీ" కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులకు టూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు పలు చర్యలు చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాం



తాల్లో యువత, మహిళలు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లకుండా, స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కుట్టుపని, హస్తకళలు, ఇతర గ్రామీణ పరిశ్రమలకు అవసరమైన ఆధునిక యంత్రాలు, పనిముట్లు ఉచితంగా అందించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# డిజిటల్ రూపాంతరణతో సుస్థిర పాలన వైపు తెలంగాణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశంలోని ప్రఖ్యాత ఈపాలన సదస్సు 'టెక్నాలజీ సభ 2026' 39వ సంచికను హైదరాబాద్‌లో ప్రారంభించిన సందర్భంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేధస్సు, డేటా వేదికలు ప్రభుత్వ పరిపాలనను విస్తృత స్థాయిలో మారుస్తున్నాయని పేర్కొన్నారు. దేశ స్థూల దేశీయోత్పత్తిలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 11.7 శాతం వాటాను కలిగి ఉందని మంత్రి తెలిపారు. పారదర్శకత, సమర్థత, పౌర కేంద్రిత విధానాల నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. డిజిటల్ వేదికల ద్వారా సేవల సరళీకరణ, వేగవంతమైన నిర్ణయ ప్రక్రియ, సమగ్ర డేటా వినియోగం వంటి అంశాలు పాలనను మరింత ప్రజలకు చేరువ చేస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో కృత్రిమ మేధస్సు రంగం, డేటా కేంద్రాలు, ఆవిష్కరణ వాతావరణం, అర్ధవాహక పరిశ్రమలకు అనుసంధానిత రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సాంకేతికత ఆధారిత అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. టెక్నాలజీ సభ 2026 సదస్సు డిజిటల్ రూపాంతరణ వేగవంతానికి, పాలనలో ఉత్తమ పద్ధతుల సంస్థీకరణకు వేదికగా నిలిచిందని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.

# ..80% ఉద్యోగాలు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్రలోని లాతూర్ వ్యాగన్ ఫ్యాక్టరీలో 70 శాతం స్థానికులకు రిజర్వేషన్ కల్పించారని, అదే విధానం కాజీపేటలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణకు ఒక విధానం, ఇతర రాష్ట్రాలకు మరో విధానం అనుసరించడం అన్యాయమన్నారు.

రాష్ట్రానికి చెందిన ఎంపీలు స్థానికుల ఉద్యోగాల అంశంపై కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. స్థానికులకు రిజర్వేషన్ ఇవ్వకుండా కేంద్ర మంత్రులు ప్రారంభోత్సవానికి వస్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కాజీపేట జంక్షన్ ప్రాధాన్యత తగ్గిపోతున్నదని, దీనిని రైల్వే జోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానికుల ఉద్యోగాల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, అవసరమైతే రాజ్యసభలోనూ ఈ అంశాన్ని లేవనెత్తుతామని హరీష్ రావు పేర్కొన్నారు.



# బల్కంపేట ఆలయంలో మల్టీ లెవల్ పార్కింగ్‌కు గ్రీన్ సిగ్నల్



- టెండర్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశాలు
- పనులు వెంటనే ప్రారంభించాలి: మంత్రి కొండా సురేఖ
- భక్తులకు సౌకర్యాల మెరుగుదల లక్ష్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** బల్కంపేట ఆలయ పరిసరాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేసి పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పార్కింగ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం పార్కింగ్ సదుపాయాల కొరత కారణంగా భక్తులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన వాహన నిలుపుదల వసతి కల్పించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని చెప్పారు. టెండర్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని, పనులు ప్రారంభమైన తర్వాత నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యం, ఆలయ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రాజెక్టును వేగవంతం చేయాలని సూచించారు.

# నిర్మాణ రంగం రాష్ట్ర భవిష్యత్తుకు పునాది

(మొదటి పేజీ తరువాయి)

మంచి రహదారి కనెక్టివిటీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలను ప్రోత్సహించి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రభుత్వం మరియు కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేస్తేనే రాష్ట్ర అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, స్థిరమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌ను కుప్పకూల్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే: కేటీఆర్

- రెండు ఏళ్లలో అన్ని రంగాల్లో రాజధానికి దెబ్బ
- అవినీతి, రియల్ ఎస్టేట్ రాజకీయాలే కారణమని ఆరోపణ
- నగర సమస్యలపై పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరాన్ని రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో అధోగతికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెట్టివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. నగర ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం తన ఆర్థిక ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలకే ప్రాధాన్యత ఇస్తూ పరిపాలన సాగుతోందని ఆరోపించారు. హైదరాబాద్ పార్టీ నేతలతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధానిలో పారిశుధ్యం నుంచి ప్రజా రవాణా వరకు అన్ని రంగాల్లో పరిస్థితి దిగజారిందని కేటీఆర్ అన్నారు. దోమల నివారణలో వైఫల్యం, కరెంట్ కోతలు, తాగునీటి ఇబ్బందులు, చెత్త నిర్వహణ లోపాలు నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతి, వ్యాపార వాణిజ్యాలు క్షీణించాయని, నగర ఆర్థిక వ్యవస్థ బలహీనపడిందని విమర్శించారు.

తన స్వప్రయోజనాల కోసం 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేర్లతో కొత్త ప్రాజెక్టులను ప్రోత్సహిస్తూ ఉన్న హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా నుంచి టీడీఆర్ వరకు పలు భూమి కుంభకోణాలు జరిగాయని, కుటుంబ సభ్యులు, అనుచరుల ప్రయోజనాల కోసం వేల కోట్ల రూపాయల భూముల వ్యవహారాలు నడుస్తున్నాయని అన్నారు. ప్రజలు ఓట్లు వేయలేదన్న కక్షతోనే నగరంపై ప్రతీకార ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో పది సంవత్సరాల పాటు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మెట్రో నగరంగా తీర్చిదిద్దామని కేటీఆర్ గుర్తు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, మెరుగైన పారిశుధ్యం, ప్రజా రవాణా వంటి అంశాల్లో నగరాన్ని ముందుకు తీసుకెళ్లామని పేర్కొన్నారు. అదే విశ్వాసంతో ప్రజలు రెండు సార్లు మేయర్ పీఠాన్ని తమ పార్టీకి అప్పగించారని అన్నారు.

సమీక్షా సమావేశంలో అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన నగర సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా పార్టీ కార్యకలాపాల సమన్వయానికి వివిధ బాధ్యతలను నేతలకు అప్పగించినట్లు వెల్లడించారు. నగర ప్రజల ఆకాంక్షలను పరిరక్షించేందుకు, ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు అన్ని విధాలా పోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కోకాపేటలో శారదా పీఠానికి భూముల కొనసాగింపు

- జల మండలికి కేటాయింపులపై సమీక్ష
- నిర్మాణాల వివరాలు తెలియజేయలేదని ఆగ్రహం
- భూములు పీఠానికే కొనసాగించాలని సీఎం ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఠానికి కేటాయించిన భూములను జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులపై పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాల తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. భూములను జల మండలికి కేటాయించే సమయంలో అక్కడ ఇప్పటికే కొనసాగుతున్న నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జల మండలికి చేసిన కేటాయింపులను రద్దు చేసి, భూములను శారదా పీఠానికే కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే నిర్మాణాలు, ఇతర పరిస్థితులపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వివరించాలని పీఠం ప్రతినిధులకు సూచించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# ఆర్ అండ్ బి అధికారులు..

- ప్రజల ప్రాణాలను కాపాడండి..!

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం బోనకల్ ప్రధాన రహదారి అయిన మత్కేపల్లి బస్ స్టాప్ వద్ద ముదిగొండ మండలానికి,జగన్నాధ పురం గ్రామానికి మరియు చింతకాని మండలానికి వెళ్లే రింగ్ వద్ద నూతనంగా నిర్మించిన రోడ్డు...తరచూ ప్రమాదాలు జరుగుతున్నవి. ప్రజలు నిత్యం జీవనం చేస్తూ..జగన్నాధపురం గ్రామంలోకి మరియు చింతకాని వెళ్ళటానికి, మరియు మత్కేపల్లి మీదగా ముదిగొండ చేరుకోవటానికి వేసిన రోడ్డుకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయకపోవడం ,ప్రమాదకర హెచ్చరిక బోర్డులను లేకపోవడం వల్ల నిత్యం అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాల బారిన పడినవారు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి వెంటనే అక్కడ (వాహనాలు నిదానంగా వెళ్లే సదుపాయం) బలమైన స్పీడ్ బ్రేకర్స్ ను ఏర్పాటు చేయాలని, ప్రమాదక హెచ్చరికలు బోర్డులను పెట్టాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు .

# కీసర పీఎస్‌లో ఏసీబీ దాడులు

- రూ.35 వేల లంచం తీసుకుంటూ హోంగార్డ్ నగేష్ అరెస్ట్

కీసర, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):



మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం దాడులు నిర్వహించి హోంగార్డ్ నగేష్‌ను లంచం తీసుకుంటూ పట్టుకున్నారు.మృతుడు తోటకూర మహేష్ పోస్ట్‌మార్టం రిపోర్ట్ అందించాలంటే మొదట రూ.2 లక్షలు ఇవ్వాలని నగేష్ డిమాండ్ చేసినట్లు మృతుడి మేనల్లుడు శరత్ ఆరోపించారు. గాంధీ ఆసుపత్రి డాక్టర్ సందీప్ పేరు చెప్పి రిపోర్ట్ త్వరగా తెప్పించాలంటే డబ్బులు అవసరమని నమ్మబలికినట్లు తెలిపారు. తోటకూర మహేష్ మృతి చెందిన నాలుగు నెలలు నెలలు గడిచినా రిపోర్ట్ అందకపోవడంతో చివరకు రూ.40 వేలుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. మొదట రూ.5 వేలు తీసుకున్న నగేష్, రెండో విడతగా రూ.35 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది.

# అమితి యూనివర్సిటీ టాపర్గా ఆయేషా...

- ఆయేషా కు అభినందన వెల్లువ*..

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 28 తెలంగాణ ముచ్చట్లు)



చత్తీస్గడ్ రాయపూర్ అమితే యూనివర్సిటీ టాపర్గా ఛత్తీస్గడ్ గవర్నర్ రామందేఖ నుండి గోల్డ్ మెడల్ సాధించిన షేక్ ఆయేషా, తల్లాడ మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన మహబూబ్ అలీ పి ఎల్ సి గా పనిచేస్తున్నారు, ఆయేషా తల్లి, గృహిణి మస్తాన్ బి, పదవ తరగతి తల్లాడ బాల భారతి విద్యాలయంలో 10/10, ఇంటర్ శ్రీ చైతన్య ఖమ్మంలో 9.8 లతో, తన ప్రతిభను చాటుకున్నారు. ఆయేషా యూనివర్సిటీ టాపర్గా రావడంతో మల్లారం గ్రామంలో ఆనంద ఉత్సవాలు వెల్లి విరిసాయి.



# నారాయణ పాఠశాలలో ఘనంగా సైన్స్ డే వేడుకలు

వనపర్తి,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):



వనపర్తి పట్టణంలోని నారాయణ పాఠశాలలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ మద్దిలేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాస్త్ర సాంకేతిక అంశాలతో రూపొందించిన ప్రదర్శనను ఆయన పరిశీలించారు.సైన్స్ ఆధారిత ప్రాజెక్టులు, విద్యార్థుల సృజనాత్మకతను ప్రతిబింబించే ప్రయోగాలు, లైవ్ మోడల్స్, వర్కింగ్ మోడల్స్, జంతువుల ద్వారా సేకరించిన లైవ్ ఆర్గాన్స్ వంటి విభిన్న రకాల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను విద్యార్థులు స్పష్టంగా వివరించడంతో ఎంఈఓ అభినందనలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మద్దిలేటి ప్రశంసిస్తూ, శాస్త్ర విజ్ఞానం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భయందర్ గౌడ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లి దండ్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి..

- మిగిలిన ముప్పై ఎకరాల భూమి ఏమైంది?
- దానం చేసిన భూమిని లాక్కునే హక్కు ఎవరిచ్చారు?..
- కూల్చివేతలకే పరిమితమైన రేవంత్ రెడ్డి పాలన..
- బాధితులకు బాసటగా నిలిచిన భారతీయ జనతా పార్టీ
- నియంతల కంటే దారుణమైన అహంకారం.. పేదల ఉసురుతో ప్రభుత్వ పతనం ఖాయం.
- మీడియా సమావేశంలో ఈటెల రాజేందర్ ఆగ్రహం.

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 28(తెలంగాణ ముచ్చట్లు)



నిరుపేదలకు దానం చేసిన భూమిని దౌర్జన్యంగా లాక్కునే హక్కు కాంగ్రెస్ పాలకులకు ఎవరిచ్చారు?.. కనీస కనికరం లేకుండా నిద్రమత్తులో ఉన్న అభాగ్యుల ఆవాసాలను నేలమట్టం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలి.. అరవై రెండు ఎకరాల భూదాన్ భూమిలో ముప్పై రెండు ఎకరాల్లో పేదలు తలదాచుకుంటుంటే అమానుషంగా లాక్కున్న అధికార పక్షం, మిగతా ముప్పై ఎకరాల భూమిని ఏ బడాబాబులకు కట్టబెట్టిందో, ఆ భూమి ఏమైందో తక్షణమే లెక్క చెప్పాలి" అంటూ భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

శనివారం ఆయన ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో తలదాచుకుంటున్న భూదాన్ బాధితులను పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. నిలువనీడ కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న బాధితులకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈటల రాజేందర్ స్వయంగా అభాగ్యులకు భోజనం వడ్డించి వారి కన్నీళ్లు తుడిచారు. ఈ కష్టకాలంలో పేదల పక్షాన భారతీయ జనతా పార్టీ నిరంతరం అండగా నిలుస్తుందని వారికి హామీ ఇచ్చారు.

అనంతరం విలేకరుల సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. గత ఐదు రోజులుగా వెలుగుమట్ల ప్రాంతంలో అమాయక ప్రజల కన్నీళ్లతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్లెదుటే గుడిసెలు కూలిపోయి బతుకులు రోడ్డున పడటంతో ఈ ప్రభుత్వం సర్వనాశనం కావాలని బాధితులు శాపనార్థాలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ఒక్క స్థానం మినహా అన్ని స్థానాలను అధికార పక్షానికే కట్టబెట్టారని, కీలక మంత్రి పదవులు కూడా ఈ జిల్లాకే దక్కాయని గుర్తుచేశారు. పలువురు మంత్రులు ఉన్నా తమకు న్యాయం జరుగుతుందని జనం ఎంతో సంబురపడ్డారని, కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే దారుణంగా తమ ఇళ్లనే కూల్చివేస్తారని నిరుపేదలు ఏనాడూ ఊహించలేదని విమర్శించారు. మొదట్నుంచీ కాంగ్రెస్ దమననీతినే కొనసాగిస్తోందని మండిపడ్డారు.

భూదాన్ భూమి అంటేనే నిరుపేదలకు దానం చేసిన భూమి అని పాలకులకు కనీస స్పృహ లేదా అని ఈటల రాజేందర్ నిలదీశారు. మహానుభావుడు వినోబా భావే వేలాది ఎకరాలను దానం చేశారని అందులో భాగంగానే సర్వే సంఖ్య నూట నలభై ఏడు, నూట నలభై ఎనిమిది, నూట నలభై తొమ్మిదిలలో అరవై రెండు ఎకరాల భూదాన్ భూమి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆనాడు ఈ భూములను ఎవరూ పట్టించుకోలేదని కానీ నేడు ఆ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో బడాబాబుల కన్ను అటు వైపు పడిందని ఆరోపించారు. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి పాలన కేవలం కూల్చివేతలకే పరిమితమైందని ధ్వజమెత్తారు. నిరుపేదలకు భూములు పంచడం చేతకాని ఈ ప్రభుత్వానికి ఉన్న భూములను కబ్జా చేయడం లాక్కోవడం మాత్రమే తెలుసునని తీవ్రంగా విమర్శించారు. రెండు వేల పంతొమ్మిదిలోనే న్యాయమూర్తి చల్లా కోదండరాం ఈ పేదలకు విద్యుత్తు నీళ్లు ఇవ్వాలని ఆదేశించినా ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈనాటి ప్రభుత్వం ఆ కనీస వసతులు కల్పించకపోగా దౌర్జన్యంగా ఉన్న ఇళ్లను కూడా లాక్కుందని మండిపడ్డారు.

ఏ న్యాయస్థానం ఇళ్లు కూల్చమని ఆదేశాలు ఇచ్చిందని రక్షక భటులతో వెళ్లి బలవంతంగా ఇళ్లు లాక్కున్నారని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. పేదల గుడిసెలు కూల్చిన పాలకులకు కబ్జా చేసిన బడాబాబుల వద్ద ఉన్న వందలాది ఎకరాల భూములు వెనక్కి తీసుకునే దమ్ము ఉందా అని సవాల్ విసిరారు. పెద్దల జోలికి వెళ్లే ధైర్యం లేకనే ఏ దిక్కూ లేని అభాగ్యులపై ప్రతాపం చూపుతున్నారని దుయ్యబట్టారు. అరవై రెండు ఎకరాల భూమిలో ముప్పై రెండు ఎకరాల్లో పేదలు తలదాచుకుంటుంటే దాన్ని అమానుషంగా లాక్కున్నారని, మిగతా ముప్పై ఎకరాలు ఎవరి చేతుల్లో ఉన్నాయో ఆ భూమి ఏమైందో చెప్పాలని నిలదీశారు. ఆ ముప్పై ఎకరాల భూమి లెక్క జిల్లా పాలనాధికారి చెప్పగలరా అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం పేదల కళ్లలో మట్టి కొట్టిన అత్యంత దుర్మార్గపు ప్రభుత్వమని విమర్శించారు.

జిల్లాలో ఉన్న భూదాన్ భూముల వివరాలు మొత్తం వెంటనే బహిర్గతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస కనికరం లేకుండా పేదల ఆవాసాలను కూల్చివేసి తప్పు జరిగినందుకు ముఖ్యమంత్రి బేషరతుగా బాధితులకు క్షమాపణ చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. పేదలు ఓట్లు వేస్తే గద్దెనెక్కిన ఈ పార్టీ పేరుకు మాత్రమే పేదల పార్టీ అని చేతల్లో మాత్రం రాక్షస పార్టీ అని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని, కూల్చిన చోటే ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహ జ్వాలల్లో ఈ ప్రభుత్వం మాడిమస్సైపోవడం ఖాయమని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు , భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, గల్లా సత్యనారాయణ , నాయకులు శీలం పాపారావు, దొంగల సత్యనారాయణ, మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వర్లు, వీరవల్లి రాజేష్, బండారు నరేష్, నున్న రవికుమార్, విజయరాజు, కుమిలి శ్రీనివాస్, రవి రాథోడ్, శ్యామ్ రాథోడ్, ఏలూరి నాగేశ్వరరావు, కందుల శ్రీకృష్ణ, మందా సరస్వతి,మనీ , నకిరేకంటి వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విజ్ఞానం సమాజ అభివృద్ధికి బలమైన పునాది

- మద్దిగట్ల–మోజర్ల పాఠశాలలో ఘనంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవం
- పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాదరావు





పెద్దమందడి, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు): శాస్త్రీయ విజ్ఞానం సమాజ అభివృద్ధికి బలమైన పునాది వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల-మోజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన శాస్త్ర ప్రదర్శనలు, వినూత్న నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణం శాస్త్ర స్ఫూర్తితో కళకళలాడింది.ముందుగా భారత శాస్త్రవేత్త సి.వి. రామన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాదరావు నివాళులర్పించి పూజా కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మద్దిగట్ల గ్రామ సర్పంచ్ రాములు యాదవ్, మోజర్ల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ వైజ్ఞానిక మేళాను ప్రారంభించి, విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. ప్రతి నమూనా వివరాలు తెలుసుకుని విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.విద్యార్థులు డైనమో ద్వారా ఏసీ–డీసీ కరెంటు వివరణ, మానవ అస్తిపంజరం, హృదయం–నాడీ వ్యవస్థ నిర్మాణం, జల విద్యుత్ ప్రాజెక్టులు, అగ్నిపర్వతం లావా విసర్జన విధానం, పర్యావరణ వ్యవస్థ, కిరణజన్య సంయోగ క్రియ, గ్లోబల్ వార్మింగ్ తదితర శాస్త్రీయ నమూనాలను ప్రదర్శించారు. మైక్రోస్కోప్ ద్వారా ఉల్లిగడ్డ అంతర్నిర్మాణం చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వరప్రసాదరావు మాట్లాడుతూ.. శాస్త్రీయ విజ్ఞానం సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. పరిశీలన, పరిశోధన, ప్రయోగాల ద్వారా నిజాన్ని తెలుసుకునే దృక్పథమే శాస్త్రీయ ఆలోచన అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథం పెంపొందితే భవిష్యత్తులో వారు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్ వరప్రసాద్ రావు, ఉపాధ్యాయులు డి రణదీవ్, పి వెంకటస్వామి, గద్వాల కృష్ణయ్య, శ్రీమతి వాణి ప్రభ, మధుసూదన్ ఎస్ వెంకటస్వామి,ఏ వెంకటస్వామి, శ్రీనివాసులు, ఏ భగవంతు, చిన్నారెడ్డి, విద్యార్థులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కాకరవాయిలో కొవ్వొత్తుల ప్రదర్శన

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 28(తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కాకరవాయి గ్రామంలో బీసీ ఎస్సీ ఎస్టీ ల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజకులపై జరిగిన దాడిలో రెండు నెలల పసి పాపను కాలితో తన్ని ప్రాణాలు తీసిన అగ్రవర్ణ నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. అమాయక శిశువు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ గ్రామస్తులు మౌనంగా నివాళులు అర్పించారు.గ్రామ ప్రధాన వీధులలో శాంతియుతంగా సాగిన ఈ ప్రదర్శనలో మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిందితులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి అమానుష ఘటనలు సమాజంలో పునరావృతం కాకూడదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్, వార్డు సభ్యులు కొత్తపల్లి వసంతరవి రజక, కొత్తపల్లి ఉష రవి రజక, నల్లగట్టు శంకర్ మహారాజ్, కొత్తపల్లి మధు రజక, ఏనుగంటి కృష్ణ రజక, దామెర్ల కృష్ణ రజక, ఏనుగంటి లింగయ్య రజక, దామెర్ల సతీష్ రజక, బాలమ్మ వెంకన్న రజక, కొత్తపల్లి లింగయ్య రజక, కొత్తపల్లి చిన్న మధు రజక, ధోనిపల్లి రాము రజక, కొత్తపల్లి రామస్వామి రజక, కొత్తపల్లి అబ్బుచంద్రు సత్యం రజక, కొత్తపల్లి చిన్నారాములు మల్లయ్య, కొత్తపల్లి హరీష్, కొత్తపల్లి నవీన్, కొత్తపల్లి యల్లమ్మ, కొత్తపల్లి అబ్బు చంద్రు వెంకన్న, గుండగాని వెంకటనారాయణ గౌడ్, సురిగి వెంకన్న గౌడ్, కొత్తపల్లి మల్లయ్య, వీరబోయిన ఉప్పయ్య యాదవ్, కొత్తపల్లి నర్సమ్మ, వీరబోయిన గొల్ల పుల్లమ్మ మహేష్ యాదవ్, పచ్చిపాల గణేష్ యాదవ్, శాలిగంటి సతీష్, మోరశశి, వీరబోయిన మధుకర్ యాదవ్, ధర్మపూరి ముత్తయ్య, నల్లగట్టు కార్తీక్, నల్లగట్టు బిక్షం, మక్కాల యల్లయ్య, వీరబోయిన ఉమశంకర్ యాదవ్, వీరబోయిన యలమంచిలి యాదవ్, వలగాని రాము గౌడ్, నల్లగట్టు రాజు, మోరపాక ఉమేష్ చంద్ర, సురిగి గణేష్ గౌడ్, కొత్త మహేష్ గౌడ్, నల్లగట్టు పందు, కొత్తపల్లి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కొత్తపల్లి వసంతరవి రజక, శంకర్ మహారాజ్ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. పసిపాపకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని గ్రామ ప్రజలు స్పష్టం చేశారు.

# ఏఎస్ రావు నగర్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు

ఏఎస్ రావు నగర్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):



జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఏఎస్ రావు నగర్ డివిజన్ టిఎస్ఐఐసి కాలనీలోని శ్రీ చైతన్య సీబీఎస్ఈ స్కూల్లో నేషనల్ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రభు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు, మోడల్స్, వినూత్న ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక శక్తి వనరులు, అంతరిక్ష సాంకేతికత తదితర అంశాలపై ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. తమ ప్రాజెక్టుల వివరాలను విద్యార్థులు స్పష్టంగా వివరించడం అందరినీ మెప్పించింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, సత్యవాణి, ప్రపూర్ణ, వసంత, జ్యోతి, అనుప్రిత, కిరణ్, మహాదేవి తదితరులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహ భరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
ఆదివారం - 01 - మార్చి 2026




# గౌతమ్ మోడల్ స్కూల్లో ఘనంగా సైన్స్ ఎక్స్‌పో

_విద్యార్థుల సృజనాత్మక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి

కుషాయిగూడ, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏఎస్ రావు నగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్ లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఎక్స్‌పో)ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుషాయిగూడ సిఐ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు.ఈ సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ మోడల్స్, ప్రాజెక్టులు మరియు ప్రయోగాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ, స□□శక్తి వినియోగం, నీటి సంరక్షణ, ఆధునిక సాంకేతికత వంటి అంశాలపై విద్యార్థులు సమగ్ర వివరణలతో ప్రదర్శనలు ఇచ్చారు. వారి ఆత్మ విశ్వాసంతో చేసిన ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సిఐ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సైన్స్ ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వి. శేషుకుమారి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా విద్యతో పాటు సైన్స్, మ్యాథ్స్ ఎక్స్‌పోలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న, వైస్ ప్రిన్సిపల్ గీత, ప్రైమరీ ఇన్‌చార్జ్ శ్రీలత, ఉపాధ్యాయులు రాధిక, రాజేందర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీలో సామూహిక సీమంతం, అక్షరాభ్యాసాలు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 28 ,(తెలంగాణ ముచ్చట్లు)

తిరుమలాయపాలెం మండలం పరిధిలోని మహ్మదాపురం బొండ తండా గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బోడా మంజు, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి కవిత హాజరయ్యారు. గర్భిణీలకు ఒడి నింపి బహుమతులు అందజేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గర్భధారణ దశ నుంచి ప్రసవం వరకు అవసరమైన టీకాలు సమయానికి వేయించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, పోషకాహార సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ లక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ నాయక్, ఆరోగ్య సిబ్బంది రేఖ, ఇందిర, శ్వేత, సారిక, జయమ్మ, ఆశా కార్యకర్త పూలమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వెల్టూర్‌లో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు

దాత శ్రీనివాస్ రెడ్డిని అభినందించిన గ్రామస్తులు

పెద్దమందడి,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన కీర్తిశేషులైన శ్రీమతి శాంతమ్మ – మాధవరెడ్డి జ్ఞాపకార్థంగా, వారి కుమారుడు శ్రీనివాసరెడ్డి గ్రామంలోని రెండు ముఖ్య ప్రదేశాలలో ఎత్తైన దీపస్తంభాలను (ఐమాస్ట్ లైట్లు) ఏర్పాటు చేయించారు.గ్రామ బస్ నిలయం వద్ద మరియు స్టేజ్ పోచమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఈ దీపస్తంభాలను గ్రామ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు కలిసి ప్రారంభించారు.ఈ దీపస్తంభాల వల్ల గ్రామానికి మరింత వెలుగు లభించడంతో పాటు రాత్రి వేళల్లో భద్రత మెరుగుపడనుంది. సంత సమయాల్లో ప్రజలు, వ్యాపారులకు సౌకర్యం కలగనుంది. గ్రామాభివృద్ధి దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. తల్లిదండ్రుల స్మృతిని నిలుపుకుంటూ గ్రామానికి ఉపయోగపడే విధంగా సేవ చేయడం శ్రీనివాసరెడ్డి మనసుకు నిదర్శనంగా నిలుస్తోంది.గ్రామస్థులంతా కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గ్రామ ఐక్యతను ప్రతిబింబిస్తోంది. అనంతరం గ్రామస్తులు దాత శ్రీనివాస్ రెడ్డిని అభినందించారు.వెల్టూర్ గ్రామం మరింత అభివృద్ధి సాధించాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



# నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఎస్ ఆర్ డి జి స్కూల్ సైన్స్ మార్చ్ నిర్వహించారు

కుషాయిగూడ, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):

నేషనల్ సైన్స్ డే పురస్కరించుకొని ఎస్ ఆర్ విద్యాసంస్థలకు చెందిన ఎస్ ఆర్ డి జి స్కూల్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఘనంగా సైన్స్ మార్చ్ నిర్వహించారు.భారతరత్న సర్ సి.వి. రామన్ కనుగొన్న 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరణ విజయాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాంతికిరణాల వ్యాప్తిపై ఆయన చేసిన పరిశోధనలు విజ్ఞానరంగానికి విశేష కీర్తి తీసుకువచ్చాయి. ఈ ఆవిష్కరణకు గాను ఆయనకు నోబెల్ బహుమతి లభించింది.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రముఖ శాస్త్రవేత్తల చిత్రపటాలు చేతబూని విజ్ఞాన ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ సైన్స్ మార్చ్ చేపట్టారు. ఎస్ ఆర్ డి జి స్కూల్ ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ మార్చ్ కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియా, తాళ్లూరు సినిమా గుండా ఈసీఐఎల్ చౌరస్తా వరకు కొనసాగింది. వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఎస్ ఆర్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు కూడా ఈ సైన్స్ మార్చ్‌లో పాల్గొన్నారు.స్కూల్ ప్రిన్సిపాల్ జి. ప్రవీణ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకుని భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, మెరిట్ ఇన్‌చార్జ్ పరమేశ్వర్ రెడ్డి, ఎస్ ఆర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# ఎల్కతుర్తిలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

ఎల్కతుర్తి. ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు)

ఎల్కతుర్తి లోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత, భారత రత్న సర్ సి.వి. రామన్ గారు తన విప్లవాత్మక ఆవిష్కరణ అయిన 'రామన్ ఎఫెక్ట్'ను ప్రపంచానికి పరిచయం చేసిన రోజు సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, వినూత్న ప్రయోగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి వినియోగం, నీటి సంరక్షణ, సాంకేతిక అభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.

పాఠశాల కరస్పాండెంట్ పుష్కారి కార్తీక్ రావు మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల చిన్నచిన్న ప్రయోగాలే రేపటి మహత్తర ఆవిష్కరణలకు నాంది అవుతాయని, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు సర్ సి.వి. రామన్ గారి జీవిత విశేషాలు, ఆయన కనుగొన్న రామన్ ఎఫెక్ట్ ప్రాముఖ్యత గురించి వివరించారు. శాస్త్ర విజ్ఞానం సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నవీన్, హెడ్ మాస్టర్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు ఆశ బేగం, సురేష్, రమేష్, కృష్ణ, సరిత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నాచారంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్ష సామాగ్రి పంపిణీ

◆ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):

త్వరలో నిర్వహించబడనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో నాచారం డివిజన్‌లోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు



సాధించి తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రతి సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందిస్తూ సహకరిస్తున్న సాయిజెన్ శేఖర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.భవిష్యత్తులో విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించి ముఖ్యంగా ఎంబీబీఎస్‌లో సీటు పొందితే ఐదేళ్ల పాటు అవసరమైన ఫీజులను భరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఇప్పటికే సుమారు 200 మంది విద్యార్థుల విద్యా ఫీజులను చెల్లిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,



# కమలానగర్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవం వేడుకలు

కమలానగర్, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా సైంటిఫిక్ టెంపర్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం కమలానగర్ కార్యాలయంలో నిర్వహించారు. సి వి రామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్‌ను గుర్తిస్తూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న దేశవ్యాప్తంగా జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని జరుపుకుంటారు.ఈ సందర్భంగా సి.వి. రామన్ చిత్రపటానికి స్ఫూర్తి గ్రూప్ నాయకురాలు అనురాధ, ప్రముఖ రచయిత



బంగారు ఆచార్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంగారు ఆచార్యులు మాట్లాడుతూ, సి.వి. రామన్ భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయ శాస్త్రవేత్త అని పేర్కొన్నారు. 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్న ఆయనకు ఇంగ్లాండ్ ప్రభుత్వం "సర్" బిరుదు, భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రదానం చేసిన విషయాలను గుర్తుచేశారు. అనురాధ మాట్లాడుతూ, కాంతి కిరణాలపై సి.వి. రామన్ చేసిన పరిశోధనలు వైద్య రంగం నుంచి అంతరిక్ష రంగం వరకు విస్తృత ప్రయోజనాలను అందించాయని తెలిపారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. గుమ్మడి హరిప్రసాద్, నవతెలంగాణ రవి, రుక్కయ్య, యాదగిరిరావు తదితరులు ప్రసంగించారు. శాస్త్రవేత్తలకు జేజేలు పలుకుతూ నినాదాలు చేశారు. గత మూడు రోజులుగా వివిధ విద్యాసంస్థల్లో జాతీయ విజ్ఞాన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని స్ఫూర్తి గ్రూప్ అధ్యక్షుడు యాదగిరిరావు తెలిపారు.కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాస్, గౌసియా, లక్ష్మయ్య, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ రహదారి విస్తరణకు లోతుకుంట రైతుల అంగీకారం

◆_డిఎల్ఎన్‌సి సమావేశంలో ధరపై చర్చలు

మేడ్చల్–మల్కాజ్గిరి, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రాజీవ్ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో లోతుకుంట గ్రామానికి చెందిన రైతులు, స్థల యజమానుల తో జిల్లా స్థాయి చర్చల కమిటీ (డిఎల్ఎన్‌సి) సమావేశం శనివారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జరిగింది.సమావేశానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షత వహించారు.సికింద్రాబాద్ నుండి శామీర్‌పేట్ వరకు రాజీవ్ రహదారి విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పోతాయిపల్లి అవార్డు ఇప్పటికే ఆమోదం పొందినట్లు వెల్లడించారు. రహదారి అభివృద్ధికి అవసరమైన భూమిని ఇవ్వడానికి లోతుకుంట రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైతులు తమ భూములకు న్యాయమైన ధర ఇవ్వాలని కోరారు. గత మూడు సంవత్సరాలుగా లోతుకుంటలో భూముల క్రయవిక్రయాలు జరగలేదని, అందువల్ల అల్వాల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డులను ఆధారంగా తీసుకుని సరైన ధరను నిర్ణయించినట్లు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం తరఫున రైతులకు అత్యుత్తమ రేటు అందిస్తామని హామీ ఇచ్చారు.కలెక్టర్ హామీపై రైతులు, స్థల యజమానులు సంతృప్తి వ్యక్తం చేస్తూ అంగీకారం తెలిపారు. దీంతో లోతుకుంట డిఎల్ఎన్‌సి సమావేశం విజయవంతమైంది.ఈ కార్యక్రమంలో ఎల్ఏ (ఇండ్స్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.మాలతి, హెచ్ఎండిఏ అధికారులు, అల్వాల్ తహసీల్దారు రాములు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కాప్రా గాంధీనగర్‌లో రూ.50 లక్షల ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ

కాప్రా, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):

కాప్రా డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫంక్షన్ హాల్‌కు భూమిపూజ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు.మాజీ కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తక్కువ కాలంలోనే కాప్రా డివిజన్ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. మాజీ కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి డివిజన్ అభివృద్ధికి చేసిన సేవలను ప్రశంసించారు.కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు బి. శివరామకృష్ణ, సిపిఎం నాయకులు కురునెల్లి వెంకట్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి. పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి, జి. సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, రిజ్వాన్ ఖాన్, సత్తిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు జి. అరుణ్ కిరణ్, మనోజ్ కుమార్, దయాకర్, విజయ్, కన్నా తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా సీనియర్ బిఆర్ఎస్ నాయకులు ఎన్. మహేష్, బి. మోహన్, గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్, యూత్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.గాంధీనగర్ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## ఆర్టీసీ కార్గో ద్వారా భక్తులకు ప్రత్యేక సేవ.!

- కేవలం రూ.151కే భక్తుల చెంతకు సీతారాముల తలంబ్రాలు.
- డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ.

సత్తుపల్లి, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరగనున్న శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణోత్సవానికి సంబంధించిన ముత్యాల తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే కేవలం రూ.151తో అందజేస్తామని సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం డిపో కార్యాలయంలో తలంబ్రాల పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, సుదూర ప్రాంతాల నుంచి భద్రాచలం వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఈ సేవను అందిస్తున్నట్లు చెప్పారు.

సత్తుపల్లి డిపో పరిధిలో తలంబ్రాలు కావలసిన భక్తులు ఆన్‌లైన్‌లో www.tgsrtclogistics.gov.in ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో కూడా సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు.

*మరిన్ని వివరాలకు* సత్తుపల్లి: 9154298585, 7981790551; అశ్వరావుపేట: 7337072844; వీఎం బంజర: 8185851075; కల్లూరు: 8688972823; అన్నపురెడ్డిపల్లి: 9701573644 నంబర్లకు ఫోన్ చేసి కూడా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలోని భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సాహితి, ఏడీసీలు ఇజ్రాయిల్, అప్పారావు, ఆఫీస్ సిబ్బంది బాబురావు, కోటేశ్వరరావు, వి.బి.ఓ ఆనందరావు, కార్గో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.కె. మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## మణిగిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

పెద్దమందడి,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల బాధ్యతలను స్వీకరించి తరగతుల్లో పాఠాలు బోధించారు.పాఠశాల నిర్వహణ విధానాలను అనుభవపూర్వకంగా తెలుసుకునే అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకున్నారు.బాధ్యతాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఉపాధ్యాయులు తెలిపారు. మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ స్వయంగా భోజనం వడ్డించారు. విద్యార్థులతో కలిసి సమయం గడిపి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సమయపాలన అలవాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## చిన్నమ్మ థామస్ సేవలు ప్రశంసనీయం

- ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా ఘన సన్మానం

వనపర్తి,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సామాజిక సేవా రంగంలో విశిష్ట కృషి చేస్తున్న రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్ సేవలు ప్రశంసనీయమని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా శనివారం కళా వేదిక ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో చిన్నమ్మ థామస్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. గత 45 సంవత్సరాలుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో చిన్నమ్మ థామస్ విద్య, గ్రామీణాభివృద్ధి, బాల్య వివాహాల నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై చేపట్టిన కార్యక్రమాలు సమాజంలో విశేష మార్పుకు దోహదపడ్డాయని అన్నారు.వందలాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, స్వశక్తితో జీవించే మార్గాన్ని అనేక మందికి చూపించారని కొనియాడారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా ఆమె పాత్ర విశేషమని తెలిపారు.అదేవిధంగా నిస్వార్థ సేవా సంస్థ నిర్వాహకుడు అరవింద్‌ను, పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాములను పట్టి అడవుల్లో విడిచిపెడుతున్న సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణా సాగర్‌ను కూడా సాహితీ కళా వేదిక ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు కందూరు నారాయణ రెడ్డి, బైరోజు చంద్రశేఖర్, సత్తార్, బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, బుచ్చిబాబు, శ్రీలక్ష్మి,

## ప్రజారోగ్య పరిరక్షణకు త్రాగునీటి శుద్ధికరణ కేంద్రాలు కీలక పాత్ర

- వరంగల్ ఎంపి కడియం కావ్య

హనుమకొండ,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):

ఫాతిమా నగర్‌లోని బాలవికాస్ పీడీటీసీ కేంద్రంలో నిర్వహించిన బాలవికాస త్రాగునీటి శుద్ధికరణ పథక కమిటీల మహాసభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన త్రాగునీటి అందుబాటును పెంచడమే పథక ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో త్రాగునీటి శుద్ధికరణ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో నీటి నాణ్యతను కాపాడేందుకు కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



నీరు జీవనానికి అత్యవసరమని, సమాజాన్ని ఏకం చేసే శక్తి నీటిలోనే ఉందని అన్నారు. విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. బాలవికాస్ సంస్థతో సమన్వయంగా పనిచేస్తే గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా మారగలవని అభిప్రాయపడ్డారు. జిల్లాలో బాలవికాస్ కార్యకలాపాలు కొనసాగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. అంతర్గత గ్రామాలకు కూడా ఈ ప్రాజెక్టులు విస్తరించాలని ఆకాంక్షించారు. స్వచ్ఛంద సంస్థలను సమాజం కుటుంబంలా భావించి, ప్రాజెక్టులను స్వంతంగా స్వీకరించినప్పుడే అవి విజయవంతమవుతాయని పేర్కొన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలకు మద్దతు అందిస్తున్న బాలవికాస్ సంస్థ సేవలను అభినందించారు. మహిళల సంక్షేమం కోసం కేంద్ర స్థాయిలో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని తాను సిఫార్సు చేసినట్లు తెలిపారు. ప్రజల అభ్యున్నతికి సంబంధించిన ప్రతి అంశానికి తాను పూర్తి మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరి రెడ్డి, పథకాల ప్రతినిధులు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఓరుగల్లు గడ్డపై ‘రుద్రమ’ విజయగర్జన!

- మోడల్ రాకెట్ ప్రయోగం వరంగల్ కు గర్వకారణం

హనుమకొండ,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):







ఓరుగల్లు గడ్డపై తొలిసారిగా నిర్వహించిన మోడల్ రాకెట్ ప్రయోగం విజయవంతమై వరంగల్‌కు గర్వకారణంగా నిలిచింది. భద్రకాళి బండ్ వేదికగా ఏటిడిఆర్ఎల్, కుడా, వరంగల్ ఎన్ఐటి సమన్వయంతో రూపొందించిన ‘రుద్రమ’ రాకెట్‌ను శశాంక్ భూపతి బృందం ప్రయోగించింది. కౌంట్‌డౌన్ అనంతరం ఆకాశాన్ని చీల్చుకుంటూ దూసుకెళ్లిన రుద్రమ నిర్దేశిత ఎత్తును చేరుకుంది. మూడో దశలో స్వల్ప సాంకేతిక ఇబ్బంది తలెత్తినప్పటికీ మొత్తం ప్రయోగం విజయవంతంగా ముగిసింది.జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, నగరవాసులు తరలివచ్చి కేరింతలతో ఉత్సాహం వ్యక్తం చేశారు. అనంతరం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం లో ఖగోళ శాస్త్రం, అంతరిక్ష ఆవిష్కరణలు, రుద్రమ రాకెట్ ప్రయోగం వంటి అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఇందులో వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ భద్రకాళి బండ్ వద్ద రాకెట్ లాంచ్ కార్యక్రమం నిర్వహించడం వరంగల్‌కు ప్రత్యేక ఖ్యాతిని తీసుకొచ్చిందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం సమాజాభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు విజ్ఞాన రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యా, విజ్ఞాన రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.

ఏటిడిఆర్ఎల్ వ్యవస్థాపకుడు శశాంక్ భూపతి మాట్లాడుతూ 2027లో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి “రుద్రమా V2” ప్రయోగానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్‌ను భవిష్యత్తులో స్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు, ఏటిడిఆర్ఎల్ బృంద సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరుణాపురం సెయింట్ ఆంథోనీ పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

ధర్మసాగర్,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం సెయింట్ ఆంథోనీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ మోడళ్లతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు.ప్రధానోపాధ్యాయుడు వేల్పుల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాజారపు ప్రభుదేవ, డైరెక్టర్ అనూష పాల్గొని విద్యార్థులు రూపొందించిన సైన్స్ పరికరాలను తిలకించారు. చిన్నారుల ప్రతిభను అభినందిస్తూ విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు.ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. శాస్త్రవేత్త చంద్రశేఖర వేంకట రామన్ రామన్ ప్రభావాన్ని కనుగొన్న సందర్భంగా ఈ దినాన్ని విజ్ఞాన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్





రాధిక, ఉపాధ్యాయులు దేవకి, రవళి, కవిత, సుమ, శ్రీలత, సుమలత, శ్రీకాంత్, హాజీరబీ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## వేలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ఫేర్

వేలేరు,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):

హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు సత్యం ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మీ బిల్లా యాదగిరి, మండల విద్యాశాఖ అధికారి చంద్రమౌగిళి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాసక్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వేలేరు గ్రామ ఉపసర్పంచ్ శ్రీకర్, పాఠశాల చైర్‌పర్సన్ రాణి, వార్డు సభ్యులు ప్రశాంత్, చైతన్య, సురేష్, సునీల్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజన్న, సబర్మతి పాఠశాల సురేష్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## కేయు హాస్టల్ అవినీతిపై ప్రభుత్వ విజిలెన్స్ విచారణ వెయ్యాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

హనుమకొండ,ఫిబ్రవరి28 (తెలంగాణ ముచ్చట్లు):

కాకతీయ విశ్వవిద్యాలయం హాస్టల్ మరియు కామన్ మెస్ నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ప్రభుత్వ విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.మెస్ బిల్లుల లెక్కలు, విద్యార్థుల వాస్తవ హాజరు సంఖ్య, టెండర్ విధానం, బిల్లుల ఆమోద ప్రక్రియలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ముఖ్యంగా సంబంధిత మెస్సుల జాయింట్ డైరెక్టర్ల అందరి సంతకాలు లేకుండానే బిల్లులు ఫైనల్ చేసిన అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఉపకులపతి ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియమించిన కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపి యూనివర్సిటీని అవినీతి పరుల చేతుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ప్రభుత్వ విజిలెన్స్ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ అధ్యక్షుడు చెన్నూరి సాయికుమార్, కార్యదర్శి బీరెడ్డి జశ్వంత్, సాయి నాయుడు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



## ముమ్మరంగా సామాజిక, ఆర్థిక సర్వే...



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి- 28(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలో ఫిబ్రవరి 24న భూదాన్ భూములలో చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో ఇండ్లు కోల్పోయిన వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వే ముమ్మరంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 21 మంది తహశీల్దార్లకు సంబంధిత వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టి, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేయగా, ఇప్పటి వరకు ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన 182 మంది, ఖమ్మం జిల్లాలోని ఇతర మండలాలకు చెందిన వారు 340 మంది ఉన్నారని, అలాగే రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందినవారు 107 మంది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు ముగ్గురు ఉన్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియ కొనసాగుతుందని, యుద్ధప్రాతిపదికన పూర్తికి చర్యలు చేపట్టినట్లు, పూర్తి అయిన తర్వాత అర్హులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నివాస స్థల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు చర్యలు చేపడతామన్నారు. సర్వే కు సంబంధించిన వ్యక్తులు, వారి వారి గ్రామాల్లో అందుబాటులో ఉండి, సామాజిక, ఆర్థిక సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఈ నెల 15న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం



- డాక్టర్ పిడమర్తి రవి
- ఉద్యమకారుల సంఘం చైర్మన్ గా డాక్టర్ చిర్ర రాజు గౌడ్(కేయూ)
- అధ్యక్షులుగా ఎండల ప్రదీప్ (టీయూ)నిజామాబాద్
- రాష్ట్ర కన్వీనర్ గా ఎండి రహీం (ఓయూ)

**హైదరాబాద్,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 15న ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి, ఉద్యమకారులకు పింఛన్ మరియు గుర్తింపు కార్డు అందించాలనే ప్రధాన డిమాండ్లతో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు భారీగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రసాధనలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఉద్యమకారులు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారందరిని గుర్తించి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం చైర్మన్‌గా డాక్టర్ చిర్ర రాజు గౌడ్, అధ్యక్షుడిగా ఎండల ప్రదీప్, రాష్ట్ర కన్వీనర్‌గా ఎండి రహీం నియామకం జరిగినట్లు ప్రకటించారు. తెలంగాణ మహిళా సంఘం అధ్యక్షురాలిగా వరలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పగిడిపల్లి చైర్మన్‌గా, రాములు నేత కన్వీనర్‌గా, తెలంగాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా చందూలాల్ నాయక్, కో చైర్మన్‌గా తోట హరీష్ నియమితులయ్యారు. సమావేశంలో డాక్టర్ మీసాల మల్లేష్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, శ్రీనాథ్ వడ్డెర, కుమార్ సాగర్, సంజయ్ గౌడ్, బుర్ర సురేష్, మేడి విజయ్, బోరెల్లి సురేష్, కోటగిరి ఉషారాణి, నక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వండి

- మంత్రి జూపల్లికి వినతి పత్రం ఇచ్చిన ఉద్యమకారులు

**హైదరాబాద్,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ మరియు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ను కలిసింది.తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని ఇచ్చిన తీర్పును గుర్తుచేస్తూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన మాటను అమలు చేయాలని వారు కోరారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ ముఖ్యమంత్రితో చర్చించి ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించే దిశగా చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం కన్వీనర్ ఎండి రహీం, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, ఓయూ జేఏసీ నాయకులు నోముల వంశీ యాదవ్, గణేష్, దేవరకొండ నరేష్, జోగు గణేష్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల బాధితులకు వెంటనే న్యాయం చేయాలి!

- కూల్చిన చోటే ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి.
- సిపిఎం పొలిటి బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 28(తెలంగాణ ముచ్చట్లు):** వెలుగు మట్ల భూ బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కూల్చిన చోటే ప్రభుత్వం బాధితులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని బివి రాఘవులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చిన వెలుగుమట్ల ప్రాంతాన్ని ఆయన సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

10 సంవత్సరాలకు పైగా వెలుగుమట్లలో ఇళ్లను నిర్మించుకొని 650 మంది పైగా పేద కుటుంబాలు నివసిస్తున్నారని, వారిని 2000మంది పైగా పోలీసులు మోహరించి ఖాళీ చేయడం దుర్మార్గమని విమర్శించారు. యుద్ధ వాతావరణ న్ని సృష్టించి కోట్ల రూపాయల ఆస్తిని నష్టం చేసి,ఇంతటి విధ్యాసాన్ని ఏ ప్రభుత్వం చేయలేదని తీవ్రంగా ఖండించారు.

ఈ చర్య వెనక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో ప్రభుత్వం జిల్లాలోని ముగ్గురు మంత్రులు తెలియజేయాల్సింది అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో భూదాన్ 62 ఎకరాలు ఉందని అనేక సందర్భాల్లో అధికారులు,, మీడియా సంస్థలు, ప్రాక్టీస్ వచ్చాయని ప్రకటిస్తూ వచ్చాయని ప్రస్తుతం సమస్య సమస్య 31ఎకరాలలోనిది అని, మిగతా 31 ఎకరాల భూమి సంగతి ఏమిటని ఆయన ప్రశ్నించారు? కేవలం ఆసరా లేని పేదల పైన ప్రభుత్వం ప్రతాపం చూపుతూ, రియల్ ఎస్టేట్, వ్యాపారులకు, సంస్థలకు, ప్రయోజనం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన విమర్శించారు. వారం రోజుల్లో బాధితుల సమస్యను సక్రమంగా పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని, అప్పుడు కూడా పరిష్కారం కాకపోతే ఇండియా బ్లాక్ పార్టీ ల దృష్టికి కూడా తీసుకువెళ్లి జాతీయ స్థాయిలో చర్చ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుదర్శన్ రావు జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు నాయకులు వై. విక్రమ్ బండి రమేష్ , బుగ్గవీటి సరళ మాచర్ల భారతి ఎర్ర శ్రీనివాసరావు మెరుగు సత్యనారాయణ బొంతు రాంబాబు కళ్యాణ వెంకటేశ్వరరావు, బండి పద్మ, పొన్నం వెంకటేశ్వర్లు బండారు రమేష్ దొంగల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

# "దళిత మహాసభ" కరపత్రాలను ఆవిష్కరించిన మాజీ మంత్రులు హరీష్ రావు, రాజయ్య



**హనుమకొండ,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):** మాదిగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మార్చి 18న హనుమకొండలో నిర్వహించనున్న దళిత మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. దళితుల సంక్షేమం మాటల్లో కాకుండా కార్యాచరణలో కనిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం సమాజం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

తాటికొండ రాజయ్య మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ మహాసభకు విస్తృత స్థాయిలో మద్దతు లభించాలని ఆకాంక్షించారు. సామాజిక న్యాయం సాధనలో దళితుల పాత్ర కీలకమని తెలిపారు. ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం పేరుతో దళితులకు 12 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు.

మార్చి 18న జరిగే దళిత మహాసభ దళిత స్వాభిమాన గర్జనగా నిలుస్తుందని, దళితుల హక్కులు సాధించేదాకా పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# నాగలిగొండలో పౌర హక్కులపై అవగాహన సదస్సు...






**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 28(తెలంగాణ ముచ్చట్లు):** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కులపై అవగాహన సదస్సు చింతకాని మండలంలోని నాగలిగొండ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఆర్ఓ బాబ్జి ప్రసాద్ మాట్లాడుతూ, పౌర హక్కులపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా గ్రామ ప్రజలు మరింత చైతన్యవంతులవుతారని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలన్నారు. గ్రామంలో ఎలాంటి సాంఘిక దురాచారాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.అనంతరం సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై సవివరంగా వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాగలిగొండ సర్పంచ్ వేపూరి పద్మ, ఉపసర్పంచ్ సిహెచ్ శ్యామల, ఆర్ఐ జగదీష్, ఏఎస్ఐ, పంచాయతీ సెక్రెటరీ, ఆశా కార్యకర్తలు, మెడికల్ డిపార్ట్మెంట్ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మరియా రాణి స్కూల్‌లో ఘనంగా యూకేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు





**ధర్మసాగర్,ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):** కరుణాపురం గ్రామంలోని మరియా రాణి హైస్కూల్‌లో యూకేజీ గ్రాడ్యుయేషన్,ఇన్వెస్టిచర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చిన్నారుల విద్యా ప్రస్థానంలో ఈ వేడుక ఒక ముఖ్యమైన దశగా నిలుస్తుందని, క్రమశిక్షణ మరియు నాయకత్వ లక్షణాలు చిన్న వయసులోనే అలవర్చుకోవాలని సూచించారు. మరో ముఖ్య అతిథిగా ఫాదర్ నవీన్ పామిశెట్టి హాజరై మాట్లాడారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయగల నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల నిర్వహణ తీసుకుంటున్న కృషిని అభినందించారు.విద్యార్థుల ప్రతిభను మెచ్చుకుని అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమక్షంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ గ్రేసీ వర్గీస్, ప్రిన్సిపాల్ సిస్టర్ విజయ మద్దెల పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# కుషాయిగూడలో పట్టపగలే ఇంటి దొంగతనం కలకలం

- 40 తులాల బంగారం, 3.7 కిలోల వెండి, రూ.2.45 లక్షల నగదు అపహరణ

**కుషాయిగూడ, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలే జరిగిన భారీ దొంగతనం ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటిలోకి ప్రవేశించి బంగారం, వెండి, నగదు అపహరించిన ఘటన వెలుగులోకి వచ్చింది.బాధితుడు జె. ఆనంద్ గుప్తా (55), తండ్రి లక్ష్మణ రాజారావు, వృత్తి వ్యాపారం, ప్లాట్ నెం. 176 & 177/P నివాసి, శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి హాజరుకావడానికి ఇంటికి తాళం వేసి వెళ్లారు.సాయంత్రం సుమారు 4:20 గంటలకు ఫిర్యాదుదారుని అల్లుడు మణికంఠ ఇంటికి వచ్చి చూడగా, ప్రధాన తలుపు ఎటువంటి బలవంతపు ధ్వంసం లేకుండానే తెరవబడి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి పరిశీలించగా గదుల్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు అందుబాటులో ఉన్న తాళాలను ఉపయోగించి అల్మారాలు తెరిచి సుమారు 40 తులాల బంగారు ఆభరణాలు, 3.7 కిలోల వెండి వస్తువులు, రూ.2.45 లక్షల నగదు అపహరించి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇంటిలో రెండు కుక్కలు ఉన్నప్పటికీ అవి మొరగకపోవడం, అలాగే ఇంటి యజమాని ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్నప్పటికీ ఎలాంటి శబ్దాలు వినిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రధాన తలుపు తాళం పగలగొట్టబడకపోవడం, అల్మారాలు అందుబాటులో ఉన్న తాళాలతోనే తెరవబడినట్లు కనిపించడం కేసులో కీలక అంశాలుగా మారాయి.ఈ ఘటనలో ఇంటి వారేనా, బయటివారేనా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. పరిసర ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సమగ్ర విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడించనున్నట్లు చెప్పారు.



# పాటలో పల్లె పలుకులు.. పోరాటంలో ప్రజల స్వరం



## జానపద గేయకవి మిట్టపల్లి సురేందర్

**ఫిబ్రవరి28(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మట్టిలో పుట్టిన పలుకులు, పల్లె గుండెలో మోగిన నినాదాలు... వాటికి పదరసం కలిపి ప్రజల హృదయాల్లో నాటిన గేయకవి మిట్టపల్లి సురేందర్. జానపద సాహిత్యాన్ని ఆధునిక భావాలతో మేళవించి సమాజ చైతన్యానికి ఆయుధంగా మలిచిన రచయితగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పల్లె జీవన శైలిని, కష్టజీవుల భావోద్వేగాలను, అట్టడుగు వర్గాల ఆవేదనను తన పాటల్లో ప్రతిబింబిస్తూ ప్రజల మనసుల్లో చోటు సంపాదించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఆయన రచనలు ప్రజా వేదికలపై మార్మోగి ఉద్యమ స్ఫూర్తికి బలాన్నిచ్చాయి. గీతం ద్వారా సందేశం చేరవేయగల శక్తి ఉందని ఆయన తన రచనలతో నిరూపించారు. సినీ రంగంలోనూ తన ముద్ర వేసిన సురేందర్, జానపద స్వరానికి ఆధునిక సంగీతాన్ని జత చేసి విభిన్న ప్రయోగాలు చేశారు. గ్రామీణ భాషలోని మాధుర్యాన్ని కాపాడుతూ, సమాజ సమస్యలను స్పష్టంగా పలికించే తీరు ఆయన రచనలకు ప్రత్యేకత. సాంస్కృతిక వేదికలపై మాత్రమే కాకుండా సామాజిక అంశాలపై కూడా స్పందిస్తూ సమాజానికి దిశానిర్దేశం చేసే రచయితగా ఆయన నిలిచారు. మాదిగల అస్తిత్వం, అట్టడుగు వర్గాల హక్కులు, తెలంగాణ సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలపై ఆయన స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. పాట ఒక వినోదం మాత్రమే కాదు, అది ఒక ఉద్యమం కూడా కావచ్చని తన సాహిత్యంతో చూపించిన మిట్టపల్లి సురేందర్, తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. ఆయన గేయాలు ఇంకా పలువురి పెదవులపై వినిపిస్తూనే ఉన్నాయి.

# "ఇంపీరియల్ ఇగ్నైట్" – యువత ప్రతిభకు వేదిక



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 28(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా ఇంపీరియల్ ఇగ్నైట్ వేడుక ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, డిప్లమా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ,విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా తత్వం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, రానున్న రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక విప్లవం మరింత వేగంగా ముందుకు సాగుతుందని, విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని సూచించారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ ఆలోచనలు మరియు సృజనాత్మకతతో ముందుకు సాగితేనే గ్లోబల్ స్థాయిలో గుర్తింపు సాధించగలరని తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలాం చెప్పినట్లుగా, కలలు కనండి, ఆ కలలను నిజం చేసుకునే దిశగా కృషి చేయండి అనే సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలని నిర్వాహకులు సూచించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయడం ప్రతి విద్యార్థి బాధ్యత అని, కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు, దీనికి అనుగుణంగా విద్యార్థుల కి కావాల్సిన అన్ని అత్యాధునిక ల్యాబ్స్ ఏర్పాట్లు కలశాలలో చేసాము అని అన్నారు.

కలశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య గారు మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు మరియు పరిశోధనల ద్వారా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలరని తెలిపారు. దేశ అభివృద్ధి దిశగా యువత తమ జ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మకతను వినియోగించుకోవాలని సూచించారు. బాధ్యతాయుత పౌరులుగా మారి సమాజానికి సేవ చేయడం ప్రతి విద్యార్థి ధర్మమని, తమ ప్రతిభతో భారతదేశాన్ని ప్రపంచ వేదికపై ఉంచాలి అని,దేశ ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఆర్టిఫిషల్ ఇంటెజెన్సీ లో అవార్డు అందుకున్న తాల్లూరి పల్లవి ని ఆదర్శగా తీసుకోవాలి అని అన్నారు.

కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ, శాస్త్రం దేశ అభివృద్ధికి మూలాధారం అని, యువత సైన్స్ మరియు టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాలు సాధించాలని, విద్యార్థులు వారు చదువుతున్న సబ్జెక్ట్ తో పాటు ప్రాక్టికల్ అనుభవం కూడా కలిగి ఉండాలని అన్నారు. పాఠ్యపుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా ప్రయోగాత్మక నైపుణ్యాలు, ఇండస్ట్రీ అవగాహన ఉంటే భవిష్యత్తులో ఉద్యోగ సాధనలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాల వైపు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ జె. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు నేటి నుంచే సాంకేతిక మార్పులకు సిద్ధంగా ఉండాలని,నైపుణ్యాభివృద్ధిపై దృష్టిసారించాలని చెప్పారు. ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే నిరంతర అభ్యాసం అవసరమని పేర్కొన్నారు.

ఈ రెండు రోజుల కార్యక్రమంలో టెక్నికల్ సెషన్లు, ప్రాజెక్ట్ ప్రదర్శనలు, ఇన్నోవేషన్ చర్చలు మరియు మోటివేషనల్ స్పీచులు, సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ఈ కార్యక్రమం లో డీన్ డాక్టర్ వి సుదర్శన్, టి పి ఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ఎలక్ట్రికల్ విభాగం అధిపతి కృష్ణ ప్రసాద్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ చార్యులు, సురేష్ పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల భయం

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు ఉత్కంఠకు గురయ్యాయి. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులకు దిగడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ప్రతిగా ఇరాన్ సైనిక చర్యలకు దిగిన నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు సరఫరాపై అనిశ్చితి నెలకొంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు సుమారు పది శాతం మేర పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులు మరింత విషమిస్తే బ్యారెల్ ధర 95 నుంచి 110 డాలర్ల స్థాయికి చేరే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం బ్యారెల్ ధర సుమారు 72.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

ఈ సంక్షోభంలో అత్యంత కీలక అంశం హార్ముజ్ జలసంధి. ప్రపంచ చమురు రవాణాలో సుమారు 20 శాతం ఈ సముద్ర మార్గం ద్వారానే జరుగుతుంది. ఇరాన్‌కు సమీపంలో ఉన్న ఈ జలసంధిలో ఎలాంటి అంతరాయం కలిగినా సరఫరా గొలుసు దెబ్బతినే ప్రమాదం ఉంది. చిన్నస్థాయి అడ్డంకి కూడా చమురు ధరలను అదనంగా 20 నుంచి 40 డాలర్ల వరకు పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముడి చమురు ధరలు పెరగడం అంటే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై నేరుగా ప్రభావం పడటం ఖాయం. ఇంధన వ్యయం పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు కూడా అధికమయ్యే అవకాశం ఉంది. దీంతో సామాన్యుడి వంటగది ఖర్చులు పెరిగి కుటుంబ బడ్జెట్‌పై ఒత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే ద్రవ్యోల్బణం ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై ఇది మరింత భారం మోపే ప్రమాదం ఉంది.

ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్లు భయాందోళనలకు లోనవుతాయి. పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడులవైపు మళ్లడంతో చమురు ధరలు వేగంగా పెరిగే అవకాశముంది. పరిస్థితి త్వరగా చల్లారకపోతే రాబోయే రోజుల్లో దేశీయంగా ఇంధన ధరల సవరణలు తప్పవని విశ్లేషకులు సూచిస్తున్నారు.

మొత్తంగా చూస్తే, పశ్చిమాసియా పరిస్థితులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావం చూపే అవకాశముంది. చమురు ధరల పెరుగుదల కేవలం వాహనదారులకే కాకుండా ప్రతి కుటుంబానికి పరోక్షంగా భారంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఈసీఐఎల్‌లో "స్వచ్ఛతా హి సేవ 2026" కార్యక్రమం ఘన ముగింపు

- మెగా శ్రమదానంలో ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు
- పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం



**కుషాయిగూడ, ఫిబ్రవరి 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో "స్వచ్ఛతా హి సేవ 2026" ప్రచారం ఘనంగా ముగిసింది. భారత ప్రభుత్వం మరియు అణుశక్తి శాఖ (డిఏఈ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు నిర్వహించిన స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలు సంస్థ అంతటా విజయవంతంగా కొనసాగాయి.ఈ కార్యక్రమాన్ని ఈసీఐఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ డా. అనీష్ కుమార్ శర్మ ప్రారంభించారు.ప్రారంభోత్సవ వేడుకలో ఉద్యోగులందరూ సామూహిక స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. పక్షం రోజుల పాటు సంస్థలోని అన్ని విభాగాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం మరియు స్థిరమైన శుభ్రత పద్ధతులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.ప్రచారంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు మెగా శ్రమదానం నిర్వహించారు. ఉద్యోగులు ఉత్సాహభరితంగా పాల్గొని కార్యాలయ ప్రాంగణం, పరిశ్రమల పరిసరాలను శుభ్రపరిచారు. దివ్యాంగులకు అనుకూలంగా టాయిలెట్లను పునరుద్ధరించడం ద్వారా సమగ్ర సౌకర్యాలను మెరుగుపరిచారు.పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అవగాహన వర్క్‌షాప్‌తో పాటు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వ్యక్తిగత రక్షణ పరికరాలు (పిపిఈ కిట్లు) పంపిణీ చేశారు.ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో పరిశుభ్రతలో ఆదర్శంగా నిలిచిన విభాగాలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్) పీకే చక్రబోర్తీ, డైరెక్టర్ (ఫైనాన్స్) సహా ఈసీఐఎల్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.సంస్థలో పరిశుభ్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించామని అధికారులు తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in